క్లుప్తంగా

బాల్యవివాహాలపై అవగాహన



నెల్లికుదురు: ఆడపిల్లే ఇంటికి మహాలక్ష్మి అని ఆడ, మగ తేడా లేకుండా సమానంగా చూడాలని ఐసీడీఎస్ సీడీపీఓ కమలాదేవి పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. మండలంలోని రాజులకొత్తపల్లి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహం చేయాలన్నారు. అంతకు ముందు వివాహాలు చేసి వారి జీవితాలను నాశనం చేయొద్దన్నారు. ఎవరైన బాల్యవివాహం చేస్తే 1098కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లీశ్వరి, సంధ్య, సారమ్మ, ఎల్లమ్మ, పద్మ, ఆశాలు మహిళలు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మించాలని ఆందోళన



కురవి: గ్రీన్‌ఫీల్డ్ హైవేపై బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండలంలోని మోద్గులగుడెం శివారు బేగావత్‌తండా ప్రజలు ఆందోళనకు దిగారు. మాజీ ఎంపీటీసీ బాలాజీ మాట్లాడుతూ.. తండాకు చెందిన రైతులు పంట పొలాల్లోకి వెళ్లడానికి అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో కర్నావత్ నాగరాజు, బేగావత్ రాందాస్, బాలోజీ, రవి, రత్న, శంకర్, రామోజీ పాల్గొన్నారు.

టీఎన్జీఓఎస్ కమిటీ ఎన్నిక



మహబూబాబాద్ అర్బన్: టీఎన్జీఓఎస్ విద్యాశాఖ ఎన్నికలు జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం.గణేష్, కార్యదర్శిగా ముజాహిద్ ఆలీ, అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు, కోశాధికారిగా శ్రీకాంత్, ఇతర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన సభ్యులను డీఈఓ రవీందర్ రెడ్డి, వడ్డెబోయిన శ్రీనివాస్ సన్మానించారు.

విద్యుత్ లైట్లు ఆర్పివేయాలి

మహబూబాబాద్ అర్బన్: వక్ఫ్ బోర్డు బిల్లు రద్దుకు నిరసనగా నేడు బుధవారం రాత్రి 9గంటల నుంచి 9:15 వరకు ప్రతీ ముస్లిం తమ ఇంటిలో కార్యాలయాల్లో, తదితర స్థలాల్లో 15 నిమిషాలు స్వచ్ఛందంగా విద్యుత్ లైట్లను ఆర్పి శాంతియుత నిరసన తెలపాలని జిల్లా వక్ఫ్ బోర్డు పరిరక్షణ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ మహమ్మద్ ఎక్బాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కమిటీ అడ్వైజర్ సభ్యులు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మహమ్మద్ ఫరీద్, కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ ఖలీల్, సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు మాత్రమే ఇళ్లు

దంతాలపల్లి: ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు ఇప్పిస్తామని డబ్బులు తీసుకుంటే వారి తాట తీస్తానని ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నర్సింహులపేట, దంతాలపల్లి కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి మండలాల గ్రామాలలో ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లు ఎన్ని, అవి నిజమైన అర్హులకే అందుతున్నాయా? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. వితంతువులకు, తాటికమ్మల గుడిసే ఉన్నవాళ్లకు, ఇల్లు కూలిపోయిన వాళ్లకు, పేదలకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఒక వేళ జాబితాలో అర్హులు కాని వారి పేర్లు వచ్చినట్లయితే వారి పేర్లు తొలగించి వాటి స్థానంలో అర్హుల పేర్లు చేర్చాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుగులోత్ బట్టు నాయక్, పీఏసీఎస్ చైర్మన్ సంపెట రాము, నాయకులు బాలాజీ, రవీందర్, లింగారెడ్డి, కొమ్మినేని సతీష్, యాకయ్య పాల్గొన్నారు.

టైఫాయిడ్‌తో విద్యార్థి మృతి

గూడూరు: టైఫాయిడ్ జ్వరంతో డిగ్రీ విద్యార్థి మృతిచెందిన సంఘటన మండలంలోని నాయకపల్లిలో మంగళవారం రాత్రి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకుల యాకాంబ్రం, మాలతి దంపతులకు ఇద్దరు కుమారులు. జీవనోపాధి కోసం యాకాంబ్రం దంపతులు పిల్లలతో కలిసి నర్సంపేటలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. కాగా పెద్ద కుమారుడు యశ్వంత్ (21) నర్సంపేట డిట్స్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. వారం రోజుల క్రితం యశ్వంత్‌కు జ్వరం రాగా ఆస్పత్రిలో చూపించారు. అక్కడ టైఫాయిడ్, విష జ్వరంగా గుర్తించి వెంటనే హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా మృతుడి అమ్మమ్మ ఊరైన ఖానాపురం మండలం బుధరావుపేటలో దహన సంస్కారాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వేతన వెతలు

- చేతిపంపుల మెకానిక్‌లకు అందని జీతాలు
- కుటుంబాన్ని సాకలేక ఇబ్బందులు

కురవి: జిల్లాలోని వివిధ మండలాల్లో మండల పరిషత్ కింద పనిచేస్తున్న చేతిపంపుల మెకానిక్‌లకు అనేక నెలలుగా వేతనాలు రాక అవస్థలు పడుతున్నారు. జిల్లాలో 13 మంది చేతిపంపుల మెకానిక్‌లు ఉన్నారు. వీరందరు మండల పరిషత్ కార్యాలయం అధీనంలో పనిచేస్తూ వివిధ గ్రామాల్లో చేతిపంపులు చెడిపోతే మరమ్మతులు చేయడానికి, కొత్త చేతిపంపుల ఏర్పాటుకు విధులు నిర్వహిస్తున్నారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న మెకానిక్‌లు చాలా మందికి సక్రమంగా వేతనాలు రావడంలేదు. 2015లో జిల్లాలో ఐదుగురు మెకానిక్‌లు రాష్ట్రంలో 31మంది మెకానిక్‌లు వేతనాలు సరిపోవడంలేదని



చేతిపంపునకు మరమ్మతులు చేస్తున్న మెకానిక్‌లు

కోర్టు మెట్లు ఎక్కారు. 2020లో హైకోర్టు తీర్పు ఇచ్చింది. తీర్పుతో మినిమమ్ పేస్కేల్ ప్రకారం రూ.13వేల వేతనాలు చెల్లిస్తున్నారు. 2024 జూన్ నెల నుంచి జిల్లాలోని కురవి, నెల్లికుదురు, నర్సింహులపేట, మహబూబాబాద్ మండలాల్లో పనిచేస్తున్న నలుగురికి వేతనాలు రావడంలేదు. వేతనాలు రాకపోవడంతో కుటుంబాలను సాకడం ఇబ్బందిగా మారింది. వీరికి అనేక నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ వేసవి కాలంలో తాగునీరు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని చెడిపోయిన చేతి పంపులను బాగు చేస్తూనే ఉన్నారు. చిరు ఉద్యోగులకు వేతనాలు అందివ్వాలని మెకానిక్‌లు కోరుతున్నారు. ఈ నాలుగు మండలాలకు తోడు మిగిలిన మండలాల్లోని మెకానిక్‌లకు సైతం సక్రమంగా వేతనాలు రావడంలేదనే విమర్శలున్నాయి.

నెలనెలా వేతనాలు ఇవ్వాలి



చాలీచాలని వేతనంతో పనిచేస్తున్నాం. నెలనెలా వేతనాలు ఇవ్వాలి. గత ఏడాది జూన్ నెల నుంచి వేతనాలు రాక ఇబ్బందిగా ఉంది. కుటుంబాలను వెల్లదీయడం కష్టంగా మారింది. అధికారులు ఆలోచించి వెంటనే వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– పడిదల జగన్, మెకానిక్, కురవి

కట్ట మరమ్మతులు పటిష్టంగా చేపట్టాలి

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

నెల్లికుదురు: తెగిపోయిన పెద్ద చెరువు కట్ట మరమ్మతు పనులు పటిష్టంగా, వేగవంతంగా చేపట్టాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ కాంట్రాక్టర్‌కు సూచించారు. మంగళవారం స్థానిక రైతులు, నాయకులు అధికారులతో కలిసి కట్ట మరమ్మతుల పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంలోని ఆలేరు గ్రామ పెద్దచెరువు కట్ట అకాల వర్షాలతో తెగిపోయిందన్నారు. మరమ్మతు పనులకు ఎఫ్‌డీఆర్ నిధులు రూ.49.50లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. కట్టపై ఉన్న పిచ్చి మొక్కలను మొత్తం తొలగించి తూములను క్లీన్ చేయించాలని అధికారులను ఆదేశించారు. నెలరోజుల్లో కట్ట గండి పనులు పూర్తి అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు ఐబీ డీఈ రాందాస్, ఏఈ సుష్మ నాయకులు ప్రభాకర్ గౌడ్, సత్యపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, బాలాజీ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



నెల్లికుదురు: మరమ్మతు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్: రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని, అన్నదాతలకు సేవ చేయడం గర్వకారణంగా భావిస్తున్నామని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మండలంలోని మాధవాపురం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మురళీనాయక్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మద్ది వెంకటరెడ్డి, బంటు అంజయ్య, బోడ కృష్ణ, కొమిరెల్లి పాపిరెడ్డి, ఆంగోత్ బీల్యా, వెంగలి సుధాకర్ రెడ్డి, నూకల రవి, భూక్య మంజ్యు, ఏఓ తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ సీఈఓ ప్రమోద్ పాల్గొన్నారు.

మే డేను జయప్రదం చేయాలి

మహబూబాబాద్ రూరల్: హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ హమాలీ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పర్వత కోటేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మే డేను జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్లను సోమవారం హమాలీల ఆధ్వర్యంలో మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆవిష్కరించారు. కార్యక్రమంలో హమాలీ ఫెడరేషన్ జిల్లా నాయకులు సురేష్, లింగన్న, రామ్మూర్తి, ఉప్పలయ్య, వెంకన్న, రవి, వెంకటేష్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

బయ్యారంలో ప్రచారం..

బయ్యారం: మేడేను జయప్రదం చేయాలని తెలంగాణ టైల్స్ వర్కర్స్ యూనియన్ (ఇఫ్టూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మదార్ పిలుపునిచ్చారు. మేడే జయప్రదం కోరుతూ మంగళవారం మండలంలోని పలు పెంకు పరిశ్రమల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు దుర్గాప్రసాద్, భాస్కర్‌రెడ్డి, కోటయ్య, పాషా, ఆదినారాయణ, సక్రు, రాంబాబు పాల్గొన్నారు.

నెహ్రూసెంటర్: కేంద్రం బీజేపీ ప్రభుత్వ అనుసరిస్తున్న విధానాలతో కార్మికలోకానికి తీవ్రనష్టం వాటిల్లుతుందని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం ప్రచారం నిర్వహించారు.

రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలి

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని కర్కాల గ్రామం నుంచి అరిపిరాల గ్రామం వరకు చేపట్టిన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంబేడ్కర్‌పై బీజేపీ నాయకులు అవమానించే విధంగా మాట్లాడితే ప్రజల తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బ్లాక్, మండల, పట్టణ అధ్యక్షులు హమ్యానాయక్, సుంచు సంతోష్, సోమ రాజశేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

చిన్నగూడూరు: మండలంలోని మన్నెగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు మంగళవారం గ్రామంలో నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో యాసంగి వరికోతలు పూర్తి చేసి ధాన్యాన్ని ఆరబెట్టామని, ఐకేపీ సెంటర్ కోసం ఎదురుచూస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గత వానాకాలంలో పండించిన ధాన్యాన్ని జయ్యారం గ్రామానికి చెందిన ఐకేపీ నిర్వాహకులు మన్నెగూడెం గ్రామానికి వచ్చి ధాన్యం కొనుగోలు చేసి తరలించేవారని తెలిపారు. యాసంగిలో మాత్రం ధాన్యం కొనుగోలు చేయకుండా పది, పదిహేను రోజుల నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామ రైతులు వాపోతున్నారు. కొనుగోలు చేసే విధంగా అధికారులు చర్య తీసుకోవాలని రైతులు బాదావత్ రామోజీ, రాసమల్ల వెంకన్న,బొడ్డు అశోక్, మెట్టు శ్రీను కోరుతున్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

ఈత సరదా... కారాదు విషాదం

- వేసవి సెలవుల్లో ఈతకు వెళ్తున్న విద్యార్థులు
- నిండుగా మున్నేరు ఆనకట్ట, చెక్ డ్యాంలు

డోర్నకల్: వేసవి సెలవులు ప్రారంభం కావడంతో ఆనందంగా గడిపేందుకు విద్యార్థులు దారులు వెతుకుతున్నారు. కొంతమంది విహారయాత్రలు, బంధువుల ఇళ్లకు వెళ్తుండగా కొంతమంది పలు రకాల శిక్షణ తరగతులకు వెళ్తున్నారు. ఎండ వేడి తీవ్రంగా ఉండటంతో కొంతమంది విద్యార్థులు ఈత కోసం వ్యవసాయ బావులు, మున్నేరు ఆనకట్ట, చెక్ డ్యాములకు వెళ్తున్నారు. ప్రస్తుతం మున్నేరు ఆనకట్ట, చెక్‌డ్యాంలు, పలు ప్రాంతాల్లోని వ్యవసాయ బావుల్లో నిండుగా నీరు ఉంది. ప్రతీ రోజూ విద్యార్థులు, పలువురు యువకులు మున్నేరు ఆనకట్ట, చెక్‌డ్యాములలో ఈత కొడుతున్నారు. ఆనకట్టతో పాటు బావులు, చెక్ డ్యాములు లోతుగా ఉండటం, నీటి మధ్యలో గుంతలు ఉండడంతో ఈతకు వెళ్లిన వారు ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. గతంలో ఈతకు వెళ్లి నీటి మునిగి చనిపోయిన ఘటనలు ఉన్నాయి. కొంతమంది తల్లిదండ్రులు గాలి నింపిన ట్యూబుల సహాయంతో తమ పిల్లలకు ఈత నేర్పే ప్రయత్నాలు చేస్తూ కనిపిస్తున్నారు. ఈత సరదా తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదాల బారిన పడి కుటుంబానికి శోకం మిగల్చవద్దని పలువురు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

వేసవి సెలవుల్లో తల్లిదండ్రులు తమ పిల్లలపై నిఘా ఉంచాలి. ఈతపై ఆసక్తి చూపితే నిపుణులైన ఈతగాళ్లతో ట్యూబులు, లైఫ్ జాకెట్లు, సేఫ్టీ రింగుల సహకారంతో ఈత నేర్పించాలి. గ్రామీణ ప్రాంతాల్లో స్విమ్మింగ్ పూల్ సౌకర్యం లేనందున వాగులు, వ్యవసాయ బావులకు వెళ్తే వాటి లోతు, నీటి అడుగున రాళ్లు, కర్రలు ఉండే అవకాశాలు ఉన్నందున జాగ్రత్తలు పాటించాలి.



మున్నేరువాగులో ఈత కొడుతున్న చిన్నారులు

తనిఖీలు చేపడుతాం..



మున్నేరు ఆనకట్ట, చెక్ డ్యాంల వద్ద తనిఖీలు చేపడుతాం. నిపుణుల సమక్షంలో రక్షణ పరికరాల సహకారంతో ఈతకు వెళ్లాలి. అనారోగ్య సమస్యలు ఉన్నవారు ఈతకు వెళ్లవద్దు. వేసవి సెలవులు పూర్తయ్యే వరకు తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి సారించాలి.

– బి.రాజేష్, సీఐ, డోర్నకల్

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

మహబూబాబాద్: ఈనెల 27న జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ అనుకున్నదాని కంటే ఎక్కువగా సక్సెస్ అయ్యిందని, అందుకు సహకరించిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, నాయకులు, కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. మానుకోట నియోజకవర్గం నుంచి పదివేల మంది అనుకుంటే అంతకంటే ఎక్కువ మంది సభకు తరలి వెళ్లారన్నారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ సభ సక్సెస్‌ను జీర్ణించుకోలేక అడ్డగోలుగా మాట్లాడుతున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు లూనావత్ అశోక్, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్, రాజు, ఏలేందర్, ఫరీద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శంకర్‌నాయక్

అంబేడ్కర్ ఆశయాల అమలుకు కృషి



కరపత్రాలతో అవగాహన కల్పిస్తున్న నాయకులు

మహబూబాబాద్ రూరల్: అంబేడ్కర్ ఆశయాలను అమలు చేస్తూ ఆయన అడుగు జాడల్లో నడుస్తున్న ఏకైన పార్టీ బీజేపీ మాత్రమే బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు క్యాచువల్ శ్యాంసుందర్ శర్మ అన్నారు. అంబేడ్కర్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు మండలంలోని వీఎస్.లక్ష్మీపురం గ్రామంలో మంగళవారం దళిత నాయకులను కలిసి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా శ్యాంసుందర్ శర్మ మాట్లాడుతూ.. అంబేడ్కర్‌కు భారతరత్న ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఓడించిందని, అంబేడ్కర్ చరిత్రను కనుమరుగు చేసేందుకు కుట్రలు చేసిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు గడ్డం అశోక్ కుమార్, కన్వీనర్ వెంకటేష్, సభ్యులు సురేష్, మల్లయ్య, జగన్, నరేష్ పాల్గొన్నారు.

కాంటా వేయకుండానే బియ్యం సరఫరా



మహబూబాబాద్: మాట్లాడుతున్న హమాలీలు

మహబూబాబాద్: మండల లెవల్ స్టాకింగ్ గోదాంలలో పని చేసే హమాలీలపై చర్య తీసుకోవాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.యాదగిరి, మండల అధ్యక్షుడు రాంచందర్ డిమాండ్ చేశాడు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో ఆందోళన చేసి డీసీఎస్‌ఓ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రేషన్ షాపులకు బియ్యం సరఫరా చేసే గోదాంలు ఆరు ఉన్నాయన్నారు. ఆ గోదాంలలో పని చేసే హామీలు బియ్యం కాంటా వేయకుండానే సరఫరా చేస్తున్నారని, దీంతో క్వింటాకు రెండు నుంచి మూడు కిలోల బియ్యం తక్కువగా వస్తున్నాయన్నారు. ఎగుమతి దిగుమతి పరంగా క్వింటాకు రూ.29 ఇచ్చినా డీలర్లు కూడా రూ.10 అదనంగా ఇవ్వాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెల 25 తేదీ నుంచి 30వ తేదీ వరకు బియ్యం షాపులకు సరఫరా చేయాల్సి ఉండగా నేటి వరకు సరఫరా చేయలేదన్నారు. ఈ సమావేశంలో డీలర్లు భిక్షం రెడ్డి, వేణు, హచ్యానాయక్, శ్రీనివాస్, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

బస్తాలు తూకం వేసి ఇవ్వాలి

గార్ల: రేషన్ బియ్యం 50 కేజీల బస్తాలను గోదాంలో తూకం వేసి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం గార్లలోని సివిల్ సప్లయి గోదాం ఎదుట గార్ల, బయ్యారం, డోర్నకల్ డీలర్ల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎట్టకేలకు గోదాం డీటీ రేషన్ బియ్యంను తూకం పెట్టి ఇస్తామని అంగీకరించడంతో డీలర్లు ధర్నాను విరమించారు. ధర్నాలో డీలర్లు పాపాలాల్, లక్ష్మణ్‌నాయక్, పెద్దిలయ్య, సందూలాల్, సుధాకర్, హరి, ఇమ్లా, సత్యనారాయణ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నల్లబ్యాడ్జీలతో నిరసన



కేసముద్రం: కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఘటనపై మున్సిపాలిటీ కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సీపీఎం నాయకులు నల్లబ్యాడ్జీలను ధరించి మంగళవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న, నాయకులు బొబ్బాల యాకుబ్‌రెడ్డి, చాగంటి కిషన్, సావిత్రి పాల్గొన్నారు.

ముందస్తు అరెస్ట్

డోర్నకల్: వేసవి సెలవులు ప్రకటించాలని మంత్రిని కలిసేందుకు మంగళవారం హైదరాబాద్ వెళ్తున్న పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అర్హులను విస్మరించారు

బయ్యారం: మండలంలోని వెంకట్రాంపురంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అర్హులను విస్మరించారని గ్రామానికి చెందిన పలువురు మంగళవారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్, అంజయ్య, సురేష్, ప్రభాకర్, అశోక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పూజలు

కేసముద్రం: మండలంలోని సప్పిడిగుట్టతండా జీపీలో నిర్వహించిన దుర్గమ్మ పండుగకు ఎమ్మెల్యే భుక్య మురళీనాయక్ మంగళవారం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడపొద్దు

కొత్తగూడ: మైనర్లు వాహనాలను నడుపవద్దని ఎస్సై కుశకుమార్ సూచించారు. మండల కేంద్రంలో వాహనాలు నడుపుతున్న మైనర్లకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

దంతాలపల్లి: మండలలంలోని స్వయంకృషి మండల సమాఖ్య పాలకవర్గాన్ని మంగళవారం గ్రూప్ సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా గున్నెపల్లి గ్రామానికి చెందిన మద్దెల కవిత, కార్యదర్శిగా బొడ్లాడ గ్రామానికి చెందిన అక్కెర రమాదేవి, కోశాధికారిగా బీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన మొగులగాని రజితను ఎన్నుకున్నారు.

హర్షణీయం

తొర్రూరు: ఈ ప్రాంతంలోని గోవులను కాపాడేందుకు పట్టణంలో గత 16ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన గోశాలలో కొంతమంది వ్యక్తులు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని, వారిపై కేసులు నమోదు కావడం హర్షణీయమని గోశాల వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి గుమ్మడవెల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలో ఆయన మాట్లాడారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

దంతాలపల్లి: మండల ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో వరంగల్, ఖమ్మం జాతీయ రహదారిపై మంగళవారం రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన చోటుచేసుకుంది. మండలంలోని దాట్ల గ్రామానికి చెందిన పత్తి సురేష్ బైక్‌పై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో కిందపడిన సురేష్‌కు తీవ్ర గాయాలు కాగా 108లో తొర్రూరు ఆస్పత్రికి తరలించారు.

స్కావెంజర్లను పట్టించుకోని ప్రభుత్వం

నెల్లికుదురు: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లు, స్కావెంజర్లకు వేతనాలు అందించకుండా పట్టించుకోకపోవడం దారుణమని స్కావెంజర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇస్సంపల్లి సైదులు ఆగ్రహం వ్యక్తం చేశాడు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రతి స్కావెంజర్‌కు ప్రతి నెల రూ.15వేల వేతనం అందే విధంగా చర్య తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఐలేష్, వెంకన్న, శ్రీను, ఉపేందర్, రమేశ్, యాకయ్య, వీరన్న పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సహజం



మహబూబాబాద్: ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమేనని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం మానుకోట మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్ ఉద్యోగ విరమణ అభినందన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ రవీందర్‌రావు హాజరయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ వెంకన్న, నాయకులు జనార్దన్, పోతు రాజు, కన్నా, గోపి, హరి పాల్గొన్నారు.

ఒకరి రిమాండ్

మహబూబాబాద్ రూరల్: ఓ హత్య కేసులో శిక్ష పడిన వ్యక్తి కోర్టుకు హాజరుకానందుకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ ఆదేశాల మేరకు అతడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని గుమ్ముడూరు ప్రాంతానికి చెందిన కేబుల్ ఆపరేటర్ షేక్ సైదులు తన భార్యను హత్య చేసిన కేసులో నాలుగేళ్ల శిక్ష అనుభవించాడు. సదరు కేసు విషయమై అతడు జిల్లా ప్రధాన న్యాయస్థానంలో అప్పీలు చేసుకుని, ఏడాదికాలంగా కోర్టుకు హాజరుకావడం లేదు. దీంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు సైదులుపై అరెస్టు వారంట్ జారీ చేశారు. కోర్టులో ప్రవేశపెట్టగా అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

కేసముద్రం: ఓ అనాథ యువకుడు అనారోగ్యంతో మృతి చెందగా, ఆ మృతదేహానికి స్థానిక ప్రజలు ముందుకు వచ్చి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్న సంఘటన మంగళవారం మున్సిపాలిటీ కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని కేసముద్రంస్టేషన్ అంబేడ్కర్ సెంటర్‌లో ఉంటున్న గారె వీరన్న(30) అనే యువకుడు హోటల్‌లో పనిచేస్తూ జీవనాన్ని సాగిస్తున్నాడు. సొంత ఇల్లు లేకపోవడంతో ఆర్యవైశ్య భవన్‌లో తల దాచుకుంటున్నాడు. కొద్ది రోజులు క్రితం అనారోగ్యానికి గురి కావడంతో మానుకోట ఆస్పత్రిలో చేరాడు. పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందాడు. 108లో మృతదేహన్ని కేసముద్రంస్టేషన్ పెద్దాయి చెరువు వద్దకు తీసుకువచ్చారు. ఈ మేరకు అంబేడ్కర్ సెంటర్‌లోని పలు దుకాణాదారులు కలిపి, మున్సిపల్ సిబ్బంది సహకారంతో అంత్యక్రియలు నిర్వహించారు.

సొంత ఖర్చులతో మోటారుకు మరమ్మతులు

కురవి: మండల కేంద్రం శివారు తులిస్యా తండా గ్రామ పంచాయతీ పరిధిలోని తులిస్యా తండాలో ఇటీవల బోరు మోటార్ కాలిపోయింది. దీంతో తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మూడు లింగన్న కొత్త సొంత ఖర్చులతో మంగళవారం మోటారుకు మరమ్మతులు చేయించి, బావికి అమర్చే విధంగా కృషి చేశాడు. అలాగే లచ్చి రాంతండాలో చేతిపంపుకు రిపేరు చేయించి, తాగునీటి ఇబ్బంది లేకుండా చేశాడు.

పాకాల ఏటిలో మునిగి వృద్ధుడి మృతి

గార్ల: ఓ వృద్ధుడు దహన సంస్కారాలకు వెళ్లి పాకాల ఏటిలో స్నానం చేస్తుండగా ఈతరాక పోవడంతో ఏటిలో మునిగి మృతిచెందిన సంఘటన మంగళవారం రాంపురం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్ల మండలం రాంపురం గ్రామానికి చెందిన గుండ్లపల్లి కనకయ్య(68), అదే గ్రామానికి చెందిన అప్పయ్య అనే వ్యక్తి మృతిచెందడంతో అతడి అంత్యక్రియల అనంతరం స్నానం చేసేందుకు గ్రామస్తులతో కలిసి కనకయ్య పాకాల ఏటిలో దిగాడు. గ్రామస్తులందరూ స్నానం చేసి వెళ్లారు. కనకయ్య సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో తల్లి లచ్చమ్మ గ్రామస్తులతో కలిసి పాకాల ఏటి వద్దకు వచ్చి వెతకగా, కనకయ్య దుస్తులు, చెప్పులు పాకాల ఏటి ఒడ్డున ఉన్నాయి. వెంటనే ఏటిలోకి దిగి వెతకగా కనకయ్య శవం నీళ్లపై తేలింది. కనకయ్యకు ఈత రాకపోవడంతోనే నీట మునిగి మృతిచెందాడని గ్రామస్తులు పేర్కొన్నారు. మృతుడి తల్లి లచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్‌కే రియాజ్‌పాషా వెల్లడించారు.